ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 వరంగల్
గురువారం 6 జూన్ 2024




అధికారులు, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్లను కట్టలు కడుతున్న సిబ్బంది

నాటికీ.. నేటికీ..

ఆరునెలల్లో ఓటరు నాడి మారింది. అందుకు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ప్రజలు పార్టీల వైపు చూసిన తీరు నిదర్శనంగా కనిపిస్తోంది. హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల సమరంలో ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టినా.. చాలా చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు చేజారటంతో కేడర్‌లో ఆందోళన కనిపిస్తోంది. ఓ వైపు మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడం.. మరో వైపు బీజేపీ అభ్యర్థి సొంత నియోజకవర్గంలో హస్తం పార్టీ ఆధిక్యం సాధించడం లాంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. పట్టణ ఓటర్లు బీజేపీ వైపే మొగ్గు చూపగా.. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌కు జై కొట్టారు. అలాగే మూడు పర్యాయాలు వరుసగా గెలిచి వరంగల్‌ను కంచుకోటగా మార్చుకున్న బీఆర్ఎస్ ఈసారి తీవ్ర నష్టాన్ని మూటగట్టుకుంది. పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండోస్థానంలో నిలవగా, మిగిలిన ఐదు చోట్ల మూడో స్థానానికి దిగజారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



'లోక్‌సభ' పరీక్షలో మంత్రులు ఫెయిల్!

- ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు
- మెదక్‌లో కొండా సురేఖ, ఆదిలాబాద్‌లో సీతక్క, కరీంనగర్‌కు పొన్నం, పెద్దపల్లిలో దుద్దిళ్ల..
- శ్రీధర్‌బాబు మినహా ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి

వివరాలు : 7లో..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

- వరంగల్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్‌కు తగ్గిన ఓటు బ్యాంకు
- అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభకు 80వేల పైచిలుకు ఓట్ల వ్యత్యాసం
- వరంగల్ తూర్పులో మంత్రి కొండాకు షాక్.. బీజేపీకి జై కొట్టిన జనం
- కమలం వైపు చూసిన అర్బన్ ఓటర్లు
- బీజేపీ అభ్యర్థి అరూరి సొంత సెగ్మెంట్‌లో హస్తానికి ఆధిక్యం
- కంచుకోటలో మూడోస్థానానికి పరిమితమైన 'గులాబీ' పార్టీ
- పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఐదు నియోజకవర్గాల్లో మూడోస్థానం
- వరంగల్ అర్బన్‌లో మరీ దారుణం.. 20వేల ఓట్లకే పరిమితం

7





6

మానుకోటలో కాంగ్రెస్ జోష్

- లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం
- ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో.. ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
2023 అసెంబ్లీ	6,63,556	1,56,638	5,03,298
లోక్‌సభ	5,81,294	3,60,955	2,32,033

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో.. ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
2023 అసెంబ్లీ	6,85,897	34,431	4,43,910
లోక్‌సభ	6,12,774	1,10,444	2,63,609

'పట్టభద్రుల' ఫలితంపై ఉత్కంఠ

- ప్రారంభమైన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు
- నల్లగొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రక్రియ
- మొత్తం 96టేబుళ్ల ఏర్పాటు.. ఒక్కో టేబుల్‌లో వెయ్యి ఓట్ల లెక్కింపు
- ప్రతీ రౌండ్‌లో 96వేల ఓట్ల కౌంటింగ్



కౌంటింగ్ కేంద్రం వద్ద తీన్మార్ మల్లన్న, రాకేష్ రెడ్డి కరచాలనం

నల్లగొండ, జూన్ 5: పార్లమెంట్ ఫలితాలు రావడంతో.. ఇక అందరి దృష్టి వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితంపై పడింది. ఈ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో భాగంగా గత నెల 27న బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ జరగ్గా.. పట్టభద్రులు ఏ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టబోతున్నారా అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. మొత్తం 52మంది అభ్యర్థులు పోటీ చేయగా.. 4.63లక్షల ఓట్లకు గాను 3.36లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అనిశెట్టిదుప్పలపల్లి గోదాముల్లో ప్రారంభమైంది. ఉదయం 8గంటలకు నల్లగొండ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన పర్యవేక్షణలో లెక్కింపును ప్రారంభించిన అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు 25బ్యాలెట్ల చొప్పున బండిల్స్‌ను కట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. మొత్తం 96టేబుళ్లను ఏర్పాటు చేసి.. ఒక్కో టేబుల్‌పై 1000ఓట్ల లెక్కన, ప్రతీ రౌండ్‌లోను 96వేల ఓట్లను కౌంట్ చేయనున్నారు. అయితే నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తవనుంది. అర్థరాత్రి దాటిన తరువాతే తొలి ప్రాధాన్యత ఓట్లపై స్పష్టత రానుంది. ఒకవేళ తొలి ప్రాధాన్యత ఓట్లద్వారా ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు, అప్పటికీ ఫలితంపై స్పష్టత రాకపోతే మూడో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఇక విజేత ఎవరనేది తేలడానికి రెండు రోజుల సమయం పట్టనుంది. ఎస్పీ చందన దీప్తి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీస్‌శాఖలోని అన్ని ర్యాంకులకు చెందిన 800మంది సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాళ్ల వద్ద డీఎస్పీ ర్యాంకు అధికారులు బందోబస్తును పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో పాటు ఇతర అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండి సరళిని తెలుసుకుంటున్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

గ్రూప్-1 ప్రిలిమ్స్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, జూన్ 5: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థుల భవిష్యత్ దృష్ట్యా చిన్న తప్పునకు కూడా ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తగా వ్యవహించాలన్నారు. సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు టీజీపీఎస్సీ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో 17 కేంద్రాల్లో

మిగతా 8వ పేజీలో..

వరదనీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5: వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాల్లో వరద నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. కొద్ది రోజుల్లో వర్షాకాలం మొదలు కానున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు కేటాయించిన డివిజన్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో జలమయం కాకుండా ముందే జాగ్రత్త పడాలన్నారు. రెండు, మూడురోజుల్లో కచ్చా కాల్వలు తవ్వించాలని, అందుకు సంబంధించిన రేఖాంశాలపై జీపీఆర్ఎస్ ఫొటోలు తీసి పంపించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి డ్రైనేజీలలో పూడికతీత ఏర్పడితే శుభ్రం చేయించాలన్నారు. గతంలో ఆర్అండ్‌బీ అధికారులు కొన్ని చోట్ల పైపులైన్లు సరిగా వేయలేదని, వాటిని ముందుగానే గుర్తించి నీరు నిలువకుండా చూడాలన్నారు. 57, 58, 59 డివిజన్లలో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, అధికారులు ముందస్తు దృష్టి సారించాలన్నారు. అంబేద్కర్ జంక్షన్‌తో పాటు సమీప ప్రాంతాల్లో నాలాలు అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఎం హెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్లు నరేందర్, భాస్కర్, సాంబయ్యలతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పోలెపాక అనిల్, గొల్కొండ శ్రీనివాస్, కుమారస్వామి, ఈశ్రం శ్రీను పాల్గొన్నారు.

ప్రమాదకర భవనాలను గుర్తించండి

వరంగల్ నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తించాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవాకం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ మాట్లాడారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలు వర్షానికి కూలి ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ముందస్తుగా అధికారులు గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రమాదాన్ని సూచించే విధంగా స్టిక్కర్లు అంటించాలన్నారు. ఇప్పటివరకు గుర్తించిన భవనాల వివరాలు తమకు అందించాలన్నారు. అపార్ట్‌మెంట్‌ల నిర్వాహకులు జూన్ 1నుంచి సెప్టెంబరు 30 వరకు సెల్లార్‌లలో విద్యుత్ మీటర్లు, కరెంటు సంబంధిత ఉపకరణాలు ఉండకుండా చూడాలన్నారు. నగర వ్యాప్తంగా 178 చెరువులు గుర్తించామని, 6 చెరువులకు సంబంధించి కోర్టు కేసులు ఉన్నందున వాటి పూర్తి వివరాలను అందించాలని అధికారులను కోరారు. సమస్యలు లేని చెరువు గట్టు ప్రాంతాలను శానిటేషన్ సిబ్బంది సహకారంతో శుభ్రం చేయించాలన్నారు. సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఖలీల్, శ్రీనివాస్‌లతో పాటు టీపీఎస్‌లు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే శ్రీహరి, డాక్టర్ కడియం కావ్య ఇతర నేతలు

సీఎంను కలిసిన కడియం కావ్య

హనుమకొండ సిటీ, జూన్ 5: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీగా విజయం సాధించిన డాక్టరు కడియం కావ్యతో పాటు జిల్లాకు చెందిన పలువురు నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో బుధవారం రేవంత్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. ఈ సందర్భంగా కడియం కావ్యను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, గండ్ర సత్యనారాయణతో పాటు మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరియపురానికి మరో అవార్డు



మరియపురం కార్యదర్శి స్వప్న, గ్రామ ప్రత్యేక అధికారి ప్రభాకర్‌కు అవార్డును అందజేస్తున్న వాణిప్రసాద్



వాణిప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న కొత్తూరు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు అనూరాధ

గీసుగొండ, జూన్ 5: ఎన్నో ఉత్తమ అవార్డులు పొందిన జాతీయ ఆదర్శ గ్రామం మరియపురానికి మరో రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఈఎఫ్ఎస్‌టీ)శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు పర్యావరణ పరిరక్షణకు కృషిచేసినందుకు గాను గ్రామానికి రాష్ట్ర ద్వితీయ ఉత్తమ అవార్డును ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈఎఫ్ఎస్‌టీ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణిప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు కార్యదర్శి బుద్ధప్రకాష్ జ్యోతి గ్రామ ప్రత్యేక అధికారి ప్రభాకర్, కార్యదర్శి స్వప్నలకు అవార్డును అందచేసి సత్కరించారు.

కొత్తూరు పాఠశాలకు..

రాయపర్తి: మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు కొంక అనూరాధ అనే ఉపాధ్యాయురాలు రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనేక విభాగాల్లో అవార్డులకు గాను దరఖాస్తులను స్వీకరించింది. దీనిలో స్కూల్స్ విభాగం నుంచి కొత్తూరు పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బుధవారం ఈఎఫ్ఎస్‌టీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ.వాణిప్రసాద్ చేతులమీదుగా హెచ్‌ఎం నోముల రంగయ్య, నేషనల్ గ్రీన్‌కోర్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయురాలు అనూరాధ బహుమతితో పాటు సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

ఐ సెట్ ప్రశాంతం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5: 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కన్వీనర్ ఆచార్య ఎస్.నరసింహాచారి తెలిపారు. మొదటి సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఎంపిక చేసిన 115 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 28,931 విద్యార్థులకు 25,982 మంది హాజరైనట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 116 పరీక్ష కేంద్రాల్లో 28,969 విద్యార్థులకు 26,298 హాజరైనట్లు పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన ఉదయం సెషన్‌తో ప్రవేశ పరీక్ష పూర్తవుతుందన్నారు. వరంగల్ రీజియన్‌లోని వరంగల్, నర్సంపేటలోని 8 సెంటర్లలో బుధవారం ఉదయం మొదటి సెషన్‌లో మొత్తం 1,554 మంది విద్యార్థులకు 1,446 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 1,554 మంది విద్యార్థులకు 1,462 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

మానుకోటలో కాంగ్రెస్ జోష్

● లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం ● ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మళ్లా పాగా వేసింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ఓటర్లు కాంగ్రెస్‌కు జై కొట్టారు. దీంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు జోష్‌లో ఉండగా.. ఇదే ఉత్సాహంతో రానున్న మునిసిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయతీలు, సహకార సంఘాల ఎన్నికలకు తామంతా సై అన్నట్టుగా అధిష్ఠానానికి సంకేతాలిస్తున్నారు. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీలు ఉండగా 18 మండలాల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీలతో పాటు 461 సర్పంచ్ స్థానాలున్నాయి. వీటిపై తిరిగి పట్టు సాధించేందుకు ఇప్పటి నుంచే గ్రామాలను శాసించే నాయకుల కోసం ముఖ్యనేతలు అన్వేషణ ప్రారంభించారు. తమతమ గ్రామాలు, పోలింగ్ బూత్‌లలో ఏ పార్టీకి ఎన్నిఓట్లు పోలయ్యాయి అనేది తెలుసుకునే దిశగా గణాంకాలు సేకరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

బీఆర్ఎస్‌ను కంగుతినిపించిన ఓటర్లు

పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి, మార్పు కావాలన్న ఆకాంక్ష నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క భద్రాచలం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో గులాబీ దండును కంగుతినిపించారు. దాని నుంచి తేరుకునే లోపే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భద్రాచలం మినహా.. ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాకల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పూర్తి పార్లమెంట్ నియోజకవర్గం హస్తం చేతిలోకి వెళ్లిపోయింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఏడు సెగ్మెంట్ల పరిధిలో కాంగ్రెస్‌కు 1,09,171 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు, బీజేపీకి కేవలం 34,431 ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కలను బేరీజు వేసుకున్న బీజేపీ వ్యూహాత్మకంగా గతంలో బీఆర్ఎస్ ఎంపీగా పనిచేసిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌కు గాలం వేసి, పార్టీలో చేర్చుకుని ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపింది. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే మరోమారు రంగంలో దిగగా.. కాంగ్రెస్ పదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించి కేంద్ర మంత్రిగా పనిచేసిన పోరిక బలరాంనాయక్‌నే అభ్యర్థిగా దించింది. ఆయన గత రెండు పర్యాయాలు ఓటమి పాలైనప్పటికి మూడోసారి ఆయనకే తిరిగి అవకాశం ఇచ్చింది. ప్రస్తుత పరిణామాల్లో పార్లమెంట్ ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. మానుకోట పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,32,366ఓట్లు ఉండగా 11,01,030ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ 6,12,774ఓట్లు సాధించి 3,46,089 మెజారిటీతో విజయం సాధించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత 2,63,609 ఓట్లతో రెండోస్థానం, బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ 1,10,444ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. ఈ లెక్కల ప్రకారం గత పార్లమెంట్ ఎన్నికల నాటిని నేటికి కాంగ్రెస్ బలం భారీగా పెరగ్గా.. బీఆర్ఎస్ గ్రాఫ్ తీవ్రంగా పడిపోయింది. ఇక బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోగలిగింది.

జోష్‌లో హస్తం శ్రేణులు

లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో వరించిన గెలుపు ఉత్సాహంతో మున్ముందు వరుసగా జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తహతహలాడుతున్నారు. పోలింగ్ బూత్‌లు, గ్రామాల వారీగా ఓటింగ్ సరళిని బేరీజు వేసుకుంటూ రెడీ టు ఫైట్ అంటున్నారు.

మానుకోట లోక్‌సభలో పోలైన ఓట్లు

అసెంబ్లీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్	95306	50293	9884
మహబూబాబాద్	102011	52128	17684
ఇల్లందు	92957	33658	12494
పినపాక	77430	28111	15170
భద్రాచలం	53637	19406	10294
ములుగు	86825	33592	19029
నర్సంపేట	100339	45228	24220
పోస్టల్ ఓట్లు	4269	1193	1669
మొత్తం	**6,12,774**	**2,63,609**	**1,10,444**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్	1,15,587	62,456	1,817
మహబూబాబాద్	1,16,644	66,473	17,038
ఇల్లందు	1,09,177	51,862	2566
పినపాక	90,510	56,004	2627
భద్రాచలం	47,533	53,252	1931
ములుగు	1,02,267	68,567	5388
నర్సంపేట	1,04,185	85,296	3062
మొత్తం	**6,85,897**	**4,43,910**	**34,431**

ముఖ్యమంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్



హనుమకొండ సిటీ, జూన్ 5: వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. డీసీసీ బ్యాంక్ నిర్వహణ, ప్రగతి తదితర అంశాలను ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి తెలియ చేశారు.

‘లోక్‌సభ’ పరీక్షలో మంత్రులు ఫెయిల్!

● ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు ● ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికల రూపంలో వచ్చిన పరీక్షలో కాంగ్రెస్ మంత్రులు ఫెయిల్ అయ్యారన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంతో పొరుగు జిల్లాల్లో ఎంపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతలు అప్పగించారు. దీంతో మంత్రులు సొంత నియోజకవర్గాలను వదిలి ఆయా లోక్‌సభ కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించినా ఫలితం లేకుండా పోయింది. వరంగల్‌లో సీనియర్ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తొలుత లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కడియం కావ్య అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో అనూహ్యంగా ఆమెను వరంగల్ బాధ్యతల నుంచి తప్పించి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి ఆ బాధ్యతలను కాంగ్రెస్ అధిష్ఠానం అప్పగించింది. ఈ క్రమంలో అప్పటికే మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న సురేఖకు మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఇచ్చారు. దీంతో సురేఖ లోక్‌సభ ఎన్నికల రాజకీయ వ్యూహాలపై దృష్టిపెట్టారు. అయినప్పటికీ మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఓటమిపాలయ్యారు. పైగా తన సొంత నియోజకవర్గం వరంగల్‌తూర్పులో బీజేపీకి ఆధిక్యం వచ్చింది.



అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆమె మూడు నెలలుగా ములుగు కంటే ఆదిలాబాద్‌లోనే ఎక్కువగా మకాం వేశారు. ఆదివాసీల ఓట్లు అధికంగా ఉండటంతో సీతక్క తన చరిష్మాతో ఆదివాసీ ఓట్లను కాంగ్రెస్‌కు మళ్లించి, పార్టీని గెలిపిస్తుందనే ఆశతో సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ బాధ్యతలను అప్పగించినా అక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిపాలయ్యారు. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వటంతో పాటు పొన్నం సూచించిన వ్యక్తికే టికెట్ పార్టీ ఇచ్చింది. అయినా కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో పొన్నం కూడా పార్టీ పెట్టిన తొలి పరీక్షలో ఫెయిల్ అయ్యారనే చర్చ జరుగుతోంది. ఇక భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగించగా... ఇక్కడ మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే ఓరుగల్లు పరిధిలో ఉన్న నలుగురు మంత్రులకు కాంగ్రెస్ అధిష్ఠానం లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగిస్తే ముగ్గురు మంత్రులు ఆశించిన స్థాయిలో రాణించలేదనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

నాటికీ.. నేటికీ..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గతేడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి.. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓరుగల్లు ఓటరు ఆలోచనలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర, జాతీయ, స్థానిక రాజకీయ, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుంటున్న ఓటర్లు అనూహ్యమైన రీతిలో నిర్ణయాలు తీసుకుంటున్నారనడానికి లోక్‌సభ పోరులో పార్టీలకు ఇచ్చిన ఓటు బ్యాంకును పరిశీలిస్తే అర్థమవుతోంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పోటాపోటీగా సాగిన పార్లమెంట్ పోరులో వరంగల్ స్థానం ‘చేతి’కి చిక్కినా.. చాలా చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు తగ్గిపోవడం శ్రేణుల్లో కలవరం రేపుతోంది. ఇక మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడం.. బీజేపీ అభ్యర్థి ఆరూరిరమేష్ సొంత నియోజవర్గంలో కాంగ్రెస్‌కు ప్రజలు జై కొట్టడం లాంటి పరిణామాలు ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం పెరగ్గా.. పట్టణ ఓటర్లు ఆ పార్టీని ఆదరించినట్లు అర్థమవుతోంది. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌వైపే నిలవగా.. వరుసగా మూడు సార్లు వరంగల్‌పై జెండా ఎగరవేసిన బీఆర్‌ఎస్ ఈసారి చతికిలపడింది. రెండు అసెంబ్లీ స్థానాల్లో ద్వితీయస్థానం పొంది.. ఐదు నియోజకవర్గాల్లో తీవ్రంగా దెబ్బతిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటర్లు ‘చే’జారినా.. విజయం కాంగ్రెస్‌దే..

కాంగ్రెస్ విజయయాత్ర కొనసాగిస్తోంది. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, పది చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలచిన కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం పెరిగింది. ఇదే క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పట్టు సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,63,556 ఓట్లు పోలయ్యాయి. అయితే లోక్‌సభ ఎన్నికల్లో 5,81,294ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చితే 82,262 ఓట్లు తగ్గాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నుంచి 1,06,690 ఓట్లు వస్తే ఈసారి 94,238 ఓట్లు వచ్చాయి. సుమారు 12వేల ఓట్లు తగ్గాయి. అలాగే భూపాలపల్లి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో 1,23,116 ఓట్లు కాంగ్రెస్ వస్తే, ఎంపీ ఎన్నికల్లో 89,463 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సుమారు 36వేలకు పైగా ఓట్లకు కోత పడింది. అలాగే పాలకుర్తిలో గతఎన్నికల్లో 1,26,848 కాంగ్రెస్‌కు పోలయితే ఈసారి కేవలం87,293 ఓట్లే పోలయ్యాయి. ఇక్కడ కూడా 38వేల ఓట్ల తగ్గాయి. మిగతా చోట్ల కూడా ఓట్లకు కోత పడింది. పరకాల, స్టేషన్‌ఘనపూర్‌లో కొంత ఓటింగ్ కాంగ్రెస్‌కు పెరిగింది. అయినప్పటికి కాంగ్రెస్ పార్టీ అంచనాలకు మించి 2.20లక్షల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించారు. ఈ గెలుపుతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్ జోష్‌గా పని చేసే అవకాశం లభించిందని కాంగ్రెస్ సీనియర్ నేతలు పేర్కొంటున్నారు.

వరంగల్ తూర్పులో మంత్రికి షాక్..

లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌తూర్పు నియోజకవర్గం చర్చనీయాంశంగా మారింది. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో బీజేపీకి మెజార్టీ ఓట్లు పోలవ్వటం హాట్ టాపిక్‌గా మారింది. తూర్పు నియోజకవర్గంలో 7,954ఓట్ల ఆధిక్యాన్ని బీజేపీ కనపర్చడం చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖకు 67,757ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావుకు 52,105ఓట్లు పోలయ్యాయి. 15,652 ఓట్ల మెజార్టీతో కొండా సురేఖ విజయం సాధించారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 66,627ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే 1,130ఓట్లు తగ్గాయి. అయితే బీజేపీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో 52,105 ఓట్లు మాత్రమే పోలయితే, ప్రస్తుతం 74,581ఓట్లు పోలయ్యాయి. 22,476ఓట్లు అధికంగా బీజేపీ రాబట్టుకుని, వరంగల్ తూర్పులో కాంగ్రెస్‌ను రెండోస్థానానికి పరిమితం చేసింది.

అనూహ్యంగా పుంజుకున్న కమలం

వరంగల్ లోక్‌సభ పరిధిలో బీజేపీ భారీగా పుంజుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1,56,638 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అనూహ్యంగా 3,60,955ఓట్లు పోలయ్యాయి. అంటే 2,04,317 ఓట్లు అత్యధికంగా పెరిగాయి. అర్బన్ ఓటర్లు కూడా బీజేపీ వైపే మొగ్గు చూపారు. వరంగల్‌తూర్పులో కాంగ్రెస్‌ను దాటేసి ఓట్లను ఆధిక్యాన్ని సాధించింది. వరంగల్ పశ్చిమలో కూడా కాంగ్రెస్‌కు దీటుగా ఓట్లను పొందింది. పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి సరైన క్యాడర్ లేకపోవటంతో ఇక్కడ మూడోస్థానానికి పరిమితమైంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో కేవలం 2,982 ఓట్లే రాగా, ఈ ఎన్నికలో 28,452 ఓట్లను రాబట్టింది. భూపాలపల్లిలో కూడా అనూహ్యంగా బీజేపీ పుంజుకుంది. ఇక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 14731 ఓట్లే పోలయితే, ఈ ఎన్నికలో 49,631 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. పరకాలలో కూడా భారీగా ఓట్లను బీజేపీ సాధించింది. పాలకుర్తి సహ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నుంచి భారీగా ఓట్లు క్రాస్ అయ్యాయి.

వర్ధన్నపేటలో అరూరికి ఝలక్..

బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు తన సొంత నియోజకవర్గ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన అరూరి రమేష్ 2023లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రమేష్‌కు 87,238 ఓట్లు పోలవగా.. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నిలిచిన ఆయనకు కేవలం 55,427 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి.. ఇప్పటికి రమేష్‌కు 31,811ఓట్లు తగ్గటం చర్చనీయాంశంగా మారింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 94,638ఓట్లు పోలయ్యాయి.

‘కారు’ పరిస్థితి మరీ దారుణం..

వరంగల్ లోక్‌సభ స్థానంలో 2014 నుంచి వరుసగా మూడు పర్యాయాలు గెలిచిన బీఆర్‌ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో మరింత దారుణంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కలిపి బీఆర్‌ఎస్‌కు 5,03,298ఓట్లు పోలవగా.. ఈ ఎంపీ ఎన్నికల్లో కేవలం 2,32,033 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే సుమారు 2,71,265ఓట్లు ఆ పార్టీకి దూరమయ్యాయనే లెక్కలు చెబుతున్నాయి. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించినా బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పరిమితం కావటం గులాబీ కేడర్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. వరంగల్ నగరంలోని వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌కు 20వేల ఓట్లు కూడా పోలవ్వలేదు. అలాగే భూపాలపల్లి, పరకాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓట్లు పొంది రెండోస్థానంలో నిలిచిన బీఆర్‌ఎస్ ఈ ఎన్నికలో నామమాత్రంగా పోటీ ఇవ్వడంపై కార్యకర్తల్లో ఆందోళన కనిపిస్తోంది. అయితే పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్‌లలో మాత్రమే బీఆర్‌ఎస్ రెండోస్థానంలో నిలిచింది. బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు చాలా వరకు బీజేపీకి, అక్కడక్కడ కాంగ్రెస్‌కు క్రాస్ అయిందనే చర్చ జరుగుతుండగా.. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీఆర్‌ఎస్‌కు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభ ఎన్నికలో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్
స్టేషన్‌ఘనపూర్	98,145	40,332	43,720
పాలకుర్తి	87,293	28,452	47,878
పరకాల	76,400	44,841	36,477
వరంగల్ పశ్చిమ	63,400	60,611	19,680
వరంగల్ తూర్పు	66,627	74,581	20,360
వర్ధన్నపేట	94,238	57,427	31,345
భూపాలపల్లి	89,463	49,631	31,360
పోస్టల్	5,728	5,080	1,213
మొత్తం	5,81,294	3,60,955	2,32,033

గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్
స్టేషన్‌ఘనపూర్	93,917	4,984	1,01,696
పాలకుర్తి	1,26,848	2,982	79,214
పరకాల	72,573	38,735	64,632
వరంగల్ పశ్చిమ	72,649	30,826	57,318
వరంగల్ తూర్పు	67,757	52,105	42,783
వర్ధన్నపేట	1,06,696	12,275	87,238
భూపాలపల్లి	1,23,116	14,731	70,417
మొత్తం	6,63,556	1,56,638	5,03,298



గ్రూప్-1 ప్రిలిమ్స్ పకడ్బందీగా నిర్వహించాలి

(5వ పేజీ తరువాయి)

9168 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరా నిఘాలో ఉంటుందని తెలిపారు. ఈసారి బయోమెట్రిక్ హాజరు విధానం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ నెల 9వ తేదీన జరగనున్న పరీక్షకు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని, ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష హాలులోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.



వీడియో సాంగ్ సీడీని లాంచ్ చేసిన గంటా రవికుమార్

నరేందర్ ఉన్నత స్థానంలో రాణించాలి

వీడియో సాంగ్ లాంచ్ చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

ఖిలావరంగల్, జూన్ 5: ప్రముఖ యూట్యూబ్ నటుడు డి. నరేందర్ భవిష్యత్తులో ఉన్నత స్థానంలో రాణించాలని వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. బుధవారం శివనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో నరేందర్ నటించి, దర్శకత్వం వహించిన విడియో సాంగ్‌ను రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటుడు నరేందర్ భవిష్యత్తులో సినీరంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, అగ్రకథానాయకులతో పోటీపడి మన వరంగల్ ప్రాంతానికి వన్నె తేవాలన్నారు. ఈ వీడియో సాంగ్ ఈ నెల 7న డీఎస్ఆర్ మ్యూజిక్ చానెల్‌లో విడుదల కానుందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్‌తో పాటు ఇనుముల రాజు, కాలువ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన రంజిత్‌కుమార్

ఖిలావరంగల్, జూన్ 5: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందిన బండి సంజయ్‌ని వరంగల్ జిల్లా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్‌కుమార్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో సంజయ్‌ను కలిసి శాలువా, బొకేతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సంజయ్‌ని కలిసిన రంజిత్‌కుమార్ →



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య

గీసుగొండ, జూన్ 5: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య అన్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల సరళిపై ఆమె ఎలుకుర్తిలో బుధవారం మాట్లాడారు. రాష్ట్రంలో 8 స్థానాలతో పాటు దేశంలో కాంగ్రెస్‌కు 230 ఎంపీ స్థానాలు రావటం కాంగ్రెస్ వైపే ప్రజలు చూస్తున్నారనటానికి నిదర్శనమన్నారు. పార్టీకి గౌరవప్రదమైన స్థానాలు ఇచ్చిన ప్రజలందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజల ఆకాంక్ష, అవసరాల మేరకే పారదర్శకతతో పనిచేస్తుందని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తుందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్ 5: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మట్టెవాడ ఫీడర్ పరిధిలోని మట్టెవాడ, గోపాలస్వామి టెంపుల్, ఎల్లంబజార్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని, అదేవిధంగా శివనగర్ ఫీడర్ పరిధిలోని శివనగర్, ఏఎస్ రెడ్డినగర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వరంగల్ డీఈ మల్లిఖార్జున్ తెలిపారు.

బడిబస్సు భద్రమేనా?



12న పాఠశాలలు పునఃప్రారంభం
వరంగల్ జిల్లాలో 350 స్కూల్ బస్సులు
ఈ నెల 15తో ముగియనున్న ఫిట్‌నెస్ గడువు

ఖిలావరంగల్, జూన్ 5: ఈ నెల 12న, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలి, ఏ పాఠశాలలో ఉత్తమ విద్యావిధానం, బోధన సిబ్బంది, వసతులు, సరిగ్గా ఉన్నాయా, లేదా అని తల్లిదండ్రులు ఆరాతీస్తుంటారు. వీటన్నింటికంటే ముఖ్యమైంది రవాణా సౌకర్యం. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి పిల్లలను క్షేమం గా చేర్చేందుకు విద్యాసంస్థలకు బస్సులున్నాయా... లేదా... అని తల్లిదండ్రులు వాకబు చేస్తుంటారు. దీని ని బట్టి తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు వారు సిద్ధమౌతున్నారు.

జిల్లాలో 350 బస్సులు

ఈనెల 12న, పాఠశాల బస్సులు రోడ్డెక్కనున్నాయి. వరంగల్ జిల్లాలో రోడ్డు రవాణా సంస్థ, (ఆర్‌టీఓ) పరిధిలో 350 పాఠశాల, కళాశాల బస్సులున్నాయి. బస్సులు ఫిట్‌నెస్ ఈనెల 15తో ముగియనుంది. కాగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తరలించి మళ్లీ ఇంటికి చేర్చడానికి పాఠశాల యాజమాన్యం, సరియైన ఆర్‌టీఏ డ్రైవింగ్ లైసెన్సు శిక్షణ పొందిన డ్రైవర్లను నియమించాలి. డ్రైవర్‌కు 18సంవత్సరాలు వయస్సు నిండి ఉండి 50 సం వత్సరాల వయస్సు వరకు కలిగిన వారిని డ్రైవర్లుగా నియమించుకోవాలి. వారికి పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు బీపీ, షుగర్, కంటి తదితర వైద్య పరీక్షలను ప్రతీ 3 నెలలకోసారి చేయించాలి. 2024 జూన్ 15న, పాఠశాల ప్రతీ బస్సుకి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం రూ.1,000లు, ప్రభుత్వ చాలన్ తీసుకోవాలి. బస్సును తప్పనిసరిగా ఆర్‌టీఓ కార్యాలయానికి తీసుకువస్తే బస్సు కండిషన్, ఇంజన్, టైర్లు, సీట్లు, బాడీ, తదితర రక్షణ సౌకర్యాలను చెక్ చేసి ఆర్‌టీఓ ఎంవీఐ-1, ఎంవీఐ-2,లు సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు.

ఆర్‌టీఓ అధికారుల చేతివాటం..?

రోడ్డు రవాణా సంస్థ మోటారు వెహికిల్ అధికారులు పాఠశాల, కళాశాలకు చెందిన బస్సులకు పర్మిట్ విషయంలో, ఫిట్‌నెస్ విషయంలో చేతివాటం చూపుతున్నారని ఆరోపణలున్నాయి. దీంతో జిల్లాలో కొన్ని సందర్భాలలో పాఠశాల, కళాశాల బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆర్‌టీఓ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు

- బస్సు డ్రైవర్ 18 నుంచి 50 సంవత్స రాలలోపు వయస్సు కలిగి ఉండాలి.
- రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బస్సులో నుంచి విద్యార్థులు బయటపడడానికి అత్యవసర ద్వారాన్ని ఏర్పాటుచేయాలి.
- బస్సులో తప్పనిసరిగా ఫస్ట్‌ఎయిడ్‌కిట్ ఉండాలి.
- పాఠశాల, కళాశాల బస్సు పసుపు రంగులో ఉండాలి. బస్సును కొనుగోలు చేసినప్పటి నుంచి 15 సంవత్సరాల వరకు మాత్రమే వినియోగించాలి. 15 సంవత్సరాలు పూర్తయిన తర్వాత పాఠశాల, కళాశాలకు వినియోగించకూడదు.
- పాఠశాల, కళాశాల బస్సు 30కిలోమీటర్ల పరిధిలో మాత్రమే తిరిగి విద్యార్థులను తరలించాలి.
- బస్సులో డ్రైవర్‌తో పాటు తప్పనిసరిగా అటెండర్ ఉండి ప్రతీ సెంటర్లలో విద్యార్థులను దగ్గరుండి బస్సు ఎక్కిచడం, దించడం చేయాలి.
- విద్యార్థులు బస్సులో కూర్చోని చేతులు, తల బయటికి పెట్టి చూడకుండా బస్సుచుట్టూ అయిరన్ రాడ్స్, బస్సు డోర్‌లకు అద్దాలను అమర్చాలి.
- విద్యార్థులు బస్సు ఎక్కేందుకు మెట్లు అనువుగా ఉండాలి. లేని పక్షంలో వారికి అనుగుణంగా తాత్కాలికంగా మరోబెంచిని ఏర్పాటుచేయాలి.

తల్లిదండ్రుల బాధ్యత

- పాఠశాల, కళాశాల బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- తల్లిదండ్రులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం బస్సు వచ్చే ప్రాంతానికి వెళ్లి బస్సు కండిషన్, డ్రైవర్, అటెండర్ ఉన్నాడా లేడా అని చెక్ చేయాలి. పాఠశాలలో నెలకోసారి జరిగే పేరెంట్స్ మీటింగ్‌లో బస్సు సౌకర్యం, డ్రైవర్, అటెండర్ విషయంలో చర్చించాలి.
- తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు స్కూల్ యాప్ ద్వారా విద్యాసంస్థ, డ్రైవర్, అటెండర్ పేరు, సెల్‌నెంబర్ తదితర వివరాలను తెలుసుకోవాలి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శంభునిపేట, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని వాగ్బాట యోగా, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెసర నిరంజన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాగ్బాట యోగా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించటంతో పాటు కాలుష్య కారకాలను నిర్మూలించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అందుకు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో వాగ్బాట గౌరవ అధ్యక్షుడు పెరుమాండ్ల మధు, కోశాధికారి గుర్రం రాంచందర్, నవీన్‌రెడ్డి, మోహన్, చిన్నగోపాల్, శ్రీశైలం, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

• మట్టెవాడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రముఖ పర్యావరణవేత్త రతన్ సింగ్ ఠాకూర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ధరిత్రి పునరుద్ధరణ, కరువు కాటకాల నివారణ అంశంపై సదస్సు నిర్వహించారు. పర్యావరణవేత్త రతన్ సింగ్ ఠాకూర్ విచ్చేసి మాట్లాడుతూ మనభూమి, మన ఫ్యూచర్ భవిష్యత్, పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. దీని కోసం మనం అడవులను నరకకుండా మొక్కలను నాటడం, ప్లాస్టిక్ నిర్మూలన, ఏడారీకరణ, కరువు కాటకాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశా ల ప్రిన్సిపాల్ భుజంగరెడ్డి, కొడిమాల శ్రీనివాసరావు, అధ్యాపకులు లాజరస్, శ్రీకాంత్, భాస్కర్, సుధారాణి, కన్జూమర్ ఆర్గనైజర్ విజయరావు, మూగ శ్రీనివాస్, వలంటీర్లు అసద్, హరిత, కృష్ణవేణి, ఫయాజ్ పాల్గొన్నారు.



రంగశాయిపేట కళాశాలలో మొక్క నాటుతున్న వాగ్బాట సభ్యులు



కుంటపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజలు

• గీసుగొండ: మొక్కలు నాటి వాటిని సంరక్షించటం ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఏపీవో చంద్రకాంత్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగాఎలుకుర్తిలో సీడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కళ్యాణి, సీడబ్ల్యూఎస్ కో ఆర్డినేటర్ కొమ్ముల నవీన్, పూర్ణిమ, మంజుల, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

• సంగెం: గ్రామాల్లో పర్యావరణాన్ని రక్షించుకోవాలని సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి అన్నారు. మండలంలోని కుంటపల్లిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీతోపాటు జడ్పీ సీఈవో రాంరెడ్డిలు హాజరై ఉపాధి కూలీలతో కలసి ర్యాలీ నిర్వహించారు. కుంటపల్లి చెరువు కట్టకు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్పీసీఈవో రాంరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడితే అది వందరెట్లు మనల్ని కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగెం ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, ఈజీఎస్ జేఈ గణేష్, పంచాయతీ కార్యదర్శి వాజిత్, సువర్ణ, మాధవి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, సొసైటీ డైరెక్టర్ గోపతిరాజు, జగన్నాథచారి. రవి, వీరస్వామి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరుపల్లెలో..

మండలంలోని గుంటూరుపల్లిలో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో, వికాస్ యూత్ అధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలను నాటి వాటి పరిరక్షణ భాధ్యతలను ప్రతీ ఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్ గాలి భిక్షపతి, యూత్ అధ్యక్షుడు వెల్దండ సురేష్‌తో పాటు పలువురు పాల్గొని మొక్కలు నాటారు.

నీట్ ఫలితాల్లో శివాని విద్యార్థుల విశ్వరూపం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి తెలిపారు. సీహెచ్ సాత్విక 720 మార్కులకు 611, ఎస్.సాయిప్రియ 535, వి.భవాని 529, ఎన్.ప్రదీప్ 487, ఇ.కార్తీక్ 483, సీహెచ్.సాద్విక 481, ఎల్.అనూష 481, బి.లోకేష్ 477, ఎం.ముఖేష్ 477, ఎన్.వర్షిత 448, కె.శివసాయి 443, ఎ.మనోజ్ 430, డి.కీర్తన 416 మార్కులు సాధించినట్లు వివరించారు. కొన్నేళ్లుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ శివాని కళాశాల పేరుప్రఖ్యాతలు నిలబెడుతున్నట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ టి.స్వామితోపాటు ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చం ద్రమోహన్, టి.రాజు, ఎస్.రమేశ్, ఎ.మురళి, వి.సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి తదితరు లు అభినందించారు.

నీట్‌లో ప్రతిభ చాటిన గ్రీష్మిత



శంభునిపేట, జూన్ 5 : నగరంలోని రంగశాయిపేటకు చెందిన దామెరకొండ గ్రీష్మిత జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. రంగశాయిపేట యాదవనగర్‌కు చెందిన దామెరకొండ నిరంజన్, భార్గవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రెండవ కుమార్తె అయిన గ్రీష్మిత చిన్నప్పటి నుంచి చదవులో ముందుండేది. పదిలో పదికి పది జీపీఏ సాధించి మన్ననలు పొందింది. తాజాగా జాతీయ స్థాయి మెడికల్ ఎంట్రెన్స్ అయిన నీట్‌లో 720 మార్కులకు గాను 664 మార్కులు సాధించింది. తాను సాధించిన మార్కులను గాంధీ, ఉస్మానియా వైద్య కళాశాలల్లో సీటు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. గ్రీష్మిత సోదరి సైతం జేఈఈలో మంచి ర్యాంకు సాధించి వరంగల్ నిట్‌లో చదువుతోంది. చదువులో రాణించి తల్లిదండ్రులకు, ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చిన గ్రీష్మితను ఈ సందర్భంగా పలువురు అభినందిస్తున్నారు.

నీట్ ఫలితాల్లో రెజోనెన్స్ విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

వరంగల్ ఎడ్యూకేషన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయభేరి మోగించారని రెజోనెన్స్ విద్యా సంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి బుధవారం తెలిపారు. సీహెచ్.ప్రజ్వల్ 720 మార్కులకు గాను 665 మార్కులు, కె.ఆకాంక్ష 651, సీహెచ్.సాయి 644, బి.నర్సింహారెడ్డి 631, జి.సాయి పవన్ 617, బి.నక్షత్ర 600 మార్కులతోపాటు 26 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు తెలిపారు. ఫ్రీ మెడికల్ సీట్లు సాధించి మార్గం సుగమం చేసుకున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మెడిసిన్ పూర్తి చేసి మరింత నిబద్ధతతో నీట్ పీజీ సీట్లు కూడా సాధించాలని సూచించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏఓ లెక్కల రమ్య రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కవిత

నర్సంపేట, జూన్ 5: చట్ట సభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత డిమాండ్ చేశారు. పట్టణంలోని మాధన్నపేట రోడ్‌లోని సీపీఐ కాలనీ వద్ద బుధవారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆవిర్భావ దినోత్స వం సందర్భంగా సంఘం జెండాను సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. మహిళా హక్కుల కోసం, మహిళల అభివృద్ధి కోసం, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తున్నామన్నారు. మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, దా డులు పెరిగి పోతున్నా అరికట్టడంలో పాలకులు విఫలం చెందుతున్నారని ఆమె విమర్శించారు. మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయిత శ్రీకళ, వడ్లకొండ యశోద, హంస మంజూల, గుంటి ఉపేంద్ర, స్వరూప, అమూల్య, దివ్య, ప్రమీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలోని సీపీఐ కాలనీ వద్ద ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జెండాను సంఘం మహిళలతో కలిసి ఆవిష్కరిస్తున్న కవిత

ఐసెట్ ప్రశాంతం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5: 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-2024 ప్రవేశ పరీక్ష ప్ర శాంతంగా జరిగినట్లు కన్వీనర్ ఆచార్య ఎస్.నరసింహాచారి తెలిపారు. మొదటి సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఎంపిక చేసిన 115 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 28,931 విద్యార్థులకు 25,982 మంది హాజరైనట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 116 పరీక్ష కేంద్రాల్లో 28,969 విద్యార్థులకు 26,298 హాజరైనట్లు పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన ఉదయం సెషన్‌తో ప్రవేశ పరీక్ష పూర్తవుతుందన్నారు. వరంగల్ రీజియన్‌లోని వరంగల్, నర్సంపేటలోని 8 సెంటర్లలో బుధవారం ఉదయం మొదటి సెషన్‌లో మొత్తం 1,554 మంది విద్యార్థులకు 1,446 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 1,554 మంది విద్యార్థులకు 1,462 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

అదనపు కమిషనర్‌కు బల్దియా సిబ్బంది శుభాకాంక్షలు



అదపు కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న జేఏసీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ జన్మదిన వేడుకలు బల్దియా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అదనపు కమిషనర్ కార్యాలయంలో బల్దియాలోని వివిధ విభాగాల సిబ్బంది అనిసుర్ రషీద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందించారు. ఏసీని కలిసిన వారిలో జేఏసీ నాయకులు రాజారపు భాస్కర్, బాకం సంతోష్‌కుమార్, చికటి గిరిబాబు, ఐత సుకథ, సంజయ్‌కుమార్, బల్దియా ఉద్యోగులు షహజాదిబేగం, రావుల ఆనంద్, శ్యాంలతో పాటు ఇండోర్ స్టేడియం శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

ఆర్యవైశ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

మట్టెవాడ, జూన్ 5: వరంగల్‌లో 60 రోజుల్లో లక్ష మందికి మజ్జిగ పంపి ణీ చేసినట్లు ఆర్యవైశ్య మిత్ర బృందం అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మిత్రబృందం ఆధ్వర్యంలో వరంగల్ మేదరివాడ కార్యాలయం ఎదుట బుధవారం మ జ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మా ట్లాడుతూ ఆర్యవైశ్య మిత్రబృందం ఆధ్వర్యంలో జరుగుతున్న మజ్జిగ, అన్నదానం, ఉప్మా, అరటిపండు, స్వీట్లు పంపిణీ కార్యక్రమంలో 60 రోజుల్లో 85 మంది దాతలు 2700 కిలోల మజ్జిగ, పెరుగు, సుమారు 60 రోజుల్లో లక్ష మందికి పంపిణీ చేశామన్నారు. సుమారు రెండు నెలలపాటు కార్యక్రమా లు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల మురళీధర్, అల్లాడి వీరభద్రయ్య, అల్లా పరమేశ్వర్, మిత్తింటి సురేందర్, చిన్నాల సురేశ్, పుల్లూరి రఘు, యాద గణేష్, సొల్లేటి కళావతి, పాల జయప్రకాశ్, ధనలక్ష్మీ, సంపూర్ణ, వనజ, సుప్రియ, జ్యోతి, రాజమణి, రేపాల హరి, తాటిపెల్లి రాజమణి, సోమ అనసూయ, అశోక్, యాద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న మిత్రబృందం సభ్యులు



మందుబాబుల అడ్డాగా.. రైతు వేదిక


రైతు వేదికలో పగిలిన మద్యం సీసాలు

ఖానాపురం, జూన్ 5 : మండలంలోని అశోక్‌నగర్ రైతువేదిక భవనం మందు బాబులకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు మందు బాబులు రైతువేదికను అడ్డాగా చేసుకొని మద్యం చేసివిస్తూ హంగామా చేస్తున్నారు. కాగా, మంగళవారం రాత్రి రైతు వేదిక సమీపంలో మద్యం సేవించిన మందు బాబులు ఖాళీ మద్యం సీసాలను రైతు వేదిక కిటికిల్లోనుంచి లోపలికి విసరడంతో సీసాలు పగిలి గాజుపెంకులు చెల్లాచెదురుగా పడ్డాయి. బుధవారం రైతు వేదిక తాళం తెరిచి లోపలికి వెళ్లిన ఏఈవో నాగరాణి పగిలిన గాజుపెంకులను చూసి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రఘుపతి రైతు వేదికలో పరిశీలించారు. విచారణ చేపట్టి ఆకతాయిలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిత్ర లేఖనంలో సిద్ధార్థకు ద్వితీయ బహుమతి


బహుమతిని అందుకుంటున్న విద్యార్థి సిద్ధార్థ

చెన్నారావుపేట, జూన్ 5 : మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సీహెచ్.సిద్ధార్థ చిత్ర లేఖనంలో బహుమతి పొందినట్లు హెచ్‌ఎం జయ బుధవారం తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా విద్యాశాఖ వారు సంయుక్తంగా జిల్లా కేంద్రంలో విద్యార్థులకు డ్రాయింగ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. చిత్రలేఖనంలో సిద్ధార్థ ద్వితీయ బహుమతిని సాధించి, బహుమతిని డీఎఫ్‌వో లావణ్య, జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనువాస్ చేతుల మీదుగా అందుకున్నాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ సుందర్, సునీత, రాగి శశిధర్, పిన్నింటి బాలాజీరావు, మాధవి, జాహెద్, ఇందిర పలువురు పాల్గొన్నారు.

చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి


జెండాను ఆవిష్కరిస్తున్న కవిత

నర్సంపేట, జూన్ 5 : చట్ట సభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత డిమాండ్ చేశారు. పట్టణంలోని మాధన్నపేట రోడ్ లోని సీపీఐ కాలనీ వద్ద బుధవారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆవిర్భావది నోత్సవం సందర్భంగా సంఘం జెండాను సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. మహిళా హక్కుల కోసం, మహిళల అభివృద్ధి కోసం, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగి స్తున్నామన్నారు. మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు, దాడులు పెరిగి పోతు న్నా అరికట్టడంలో పాలకులు విఫలం చెందుతున్నారని విమర్శించారు. మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయిత శ్రీకళ, వడ్లకొండ యశోద, హంస మంజుల, గుంటి ఉపేంద్ర, స్వరూప, అమూల్య దివ్య, ప్రమీల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

చెన్నారావుపేట, జూన్ 5: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణా అన్నారు. బుధవారం మండలంలోని లింగగిరి, శంకరంతండా, తోపనగడ్డతండా,నాయక్‌బోడు తండా, జీడి గడ్డతండా, చంద్రుతండా, ఎస్‌సీ కాలనీ, బాపునగర్, అమ్మ ఆదర్శ పాఠశాలలను ఆకస్మీకంగా ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పనులను వేగవంతంగా చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు టాయిలెట్స్, కిచెన్, వాష్‌బేషన్ పనులను, కరెంటు పనులను వెంట వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరావు, మండల నోడల్ అధికారి బి.సరళ, డీఈ రాజశేఖర్, ఏఈ నరేష్, హెచ్‌ఎం కట్టస్వామి, మహేందర్, భాస్కర్, అనిల్, శ్రీనువాస్, రవి, భద్రు, పంచాయతీ సెక్రటరీ మాలతీ, శ్రీనాథ్, సీఆర్‌పీ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ధన్యవాదాలు

నల్లబెల్లి, జూన్ 5 : పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌ను అత్యధిక మోజార్టితో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లబెల్లి మండలంలో బలరాంనాయక్‌కు 5482 ఓట్ల మోజార్టీ ఇచ్చిన ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలోతు రమేష్, వైనాల అశోక్, ఇస్తారు శేకర్, చార్ల శివారెడ్డి, మాలోతు చరణ్‌సింగ్, రామ్మూర్తి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు చైతన్య సదస్సుల జాడేదీ?

ఐదేళ్లుగా లేని సమావేశాల ఊసు
వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు


పర్శనాయక్‌తండాలో దుక్కి దున్నుతున్న రైతు

ఖానాపురం, జూన్ 5 : వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఇవ్వడానికి ప్రతి ఏటా మే నెలలో మన తెలంగాణ-మన వ్యవసాయం పేరుతో అన్ని గ్రామాల్లో రైతు చైతన్య సదస్సులను నిర్వహించేవారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సైతం పాల్గొనేవారు. ఖరీఫ్‌కు ముందు వారం రోజుల పాటు నిర్వహించాల్సిన రైతు చైతన్య యాత్రలు గత ఐదేళ్లుగా నిర్వహించడం లేదు. దీంతో ఖరీఫ్‌లో ఎలాంటి పంటలు వేయాలి, మంచి దిగుబడి ఎలా సాధించాలో చెప్పే వారు, అన్నదాతల్లో చైతన్యం కలిగించేవారు, దిశానిర్దేశం చేసేవారు కరువయ్యారు.

కనిపించని మన ఊరు.. మన వ్యవసాయం..

రైతు చైతన్య సదస్సులో భాగంగా గతంలో మన ఊరు మనవ్యవసాయం కార్యక్రమంలో వ్యవసాయాధికారులు గ్రామగ్రామాన సదస్సులు నిర్వహించేవారు. భూసార పరీక్షల ఆవశ్యకత, పంట మార్పిడి విధానం, ఆధునిక వ్యవసాయపద్ధతులు, ఏ భూమిలో ఏ పంటలు వేయాలన్న విషయాలపై రైతులకు అవగాహన కల్పించేవారు. అధిక వర్షాపాతంలో ఏ పంటలు సాగుచేయాలన్నా విషయంపై జాగ్రత్తలు చెప్పేవారు లేక పోవడంతో ఏ పంటలు వేయాలన్నా ఆలోచనలో పడ్డారు రైతులు.

అవగాహన లేమితో నష్టాలు

ప్రభుత్వం రైతులకు సాగులో వివిధ రకాల సూచనలు అందించినప్పుడే వారు అన్ని విధాల లాభం పొందుతారు. రైతులకు సాగుపై సరైన అవగాహన లేకపోవడంతో నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. గతంలో ప్రతి ఏటా రైతు చైతన్య సదస్సులు నిర్వహించినందున రైతులకు సాగు విషయంలో ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం సదస్సులు నిర్వహించకపోవడంతో రైతులకు సాగులో ఎలాంటి సలహాలు, సూచనలు అందకుండా పోతోంది. నూతన ప్రభుత్వమైన స్పందించి సాగులో సూచనలు, సలహాలతో పాటు ఎలాంటి పంటలు ఏ సమయంలో వేయాలి అనే దానిపై అవగాహన కల్పించాలని రైతులు కోతున్నారు.

మండలంలో సాగు విధానం

ఖానాపురం మండలం పంటల సాగులో జిల్లాలలోనే ప్రముఖ ధాన్యాగార కేంద్రంగా విరజిల్లుతోంది. మండలంలో వానాకాలం, యాసంగిలో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. మండలంలోని 20 గ్రామాల్లో వానాకాలంలో ఏటా మొత్తం 25వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి 19వేల ఎకరాల్లో, మొక్కజొన్న 2500 ఎకరాల్లో, పత్తి 2వేల ఎకరాల్లో, మిర్చి, ఆయిల్ ఫామ్‌తో పాటు ఇతర పంటలు 1500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అత్యధికంగా వరిసాగుకు ఏటా రైతులు మొగ్గు చూపుతున్నారు. కాగా, పంటల సాగులో రైతులకు సరైన మెలకువలు లేని కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

భూసార పరీక్షల ఆవశ్యకత, పంట మార్పిడి పద్ధతి, ఆధునిక పద్ధతిలో సాగు విధానం, ఏ సమయంలో ఏ పంటలు వేసుకోవాలనే విషయంపై గ్రామాల్లో రైతులకు పూర్తిస్థాయిలో సూచనలు అందడం లేదు. దీంతో ఐదేళ్లుగా రైతులు వారికి ఇష్టం వచ్చిన పంటలను సాగు చేసి నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు చైతన్య సదస్సులను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

రైతు వేదికల్లో మొక్కుబడిగా అవగాహన సదస్సులు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగులో సలహాలు, సూచనలు అందించేందుకు గ్రామాల్లో రైతు వేదికలు ఏర్పాటుచేసింది. వీటి ద్వారానే వ్యవసాయాధికారులు రైతులకు సలహాలు, సూచనలు అందించాల్సి ఉంది. ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసి సందేహాలను నివృత్తి చేసి వ్యవసాయంలో అధిక దిగుబడులు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా కొన్ని రైతు వేదికల్లో అధికారులు మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో రైతులకు ఉపయోగకరంగా లేకుండా పోతున్నాయి.

వర్ధన్నపేటలో కాంగ్రెస్ హవా..

వర్ధన్నపేట, జూన్ 5 : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి తన హవా కొనసాగించి సత్తాచాటింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కోటను బద్దలుకొట్టి కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజు 19వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా ఎంపీ ఎన్నికల్లోనూ అదే ఒరవడిని కొనసాగించి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు భారీ మెజార్టీని అందించడంలో వర్ధన్నపేట నియోజకవర్గం కీలకంగా మారింది. నియోజకవర్గంలో మొత్తం 278 పోలింగ్ కేంద్రాల్లో 1,97,781 ఓట్లు పోల్‌కాగా బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు 57,427ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు 94238 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్‌కు 31,345 ఓట్లు పోల్ అయ్యాయి. వర్ధన్నపేట 12 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగడంతో 4వేలకు పైచిలుకు ఓట్లు ఆధికత్యత సాధించింది. మండలంలోని ఇల్లంద రెండు బూత్‌ల్లో మాత్రమే బీజేపీకి మెజార్టీ వచ్చింది. బీఆర్ఎస్ పార్టీ మాత్రం మండలంలోని అన్ని గ్రామాల్లో తృతీయ స్థానంలో నిలిచింది. కాగా, వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య నాయకులకు సన్నిహితంగా ఉండడం, ఆయన కుమార్తె కావ్య వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిగా ఈ ప్రాంత ప్రజలకు పరిచయం ఉండడంతో భారీ మెజార్టీ సాధించడం సులభమైంది.

ప్రధానిగా మూడోసారి మోదీనే..


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట, జూన్ 5: దేశ ప్రధానిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయనున్నారని బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. మోదీ నాయకత్వంలో దేశంలో ఎన్‌డీఏ కూటమి విజయదుందుబి మోగించడాన్ని, తెలంగాణలో బీజేపీ 8పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించడాన్ని హర్షిస్తూ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం రాత్రి విజయోత్సవ సంబరాలను నిర్వహించామన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమితో కలిసి మూడోసారి కేంద్ర ప్రభుత్వం కొలువు తీరనుందన్నారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ఈ నెల 9న ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీకి ఎనిమిది వంతుల ఓట్లు పెరిగాయన్నారు. పార్టీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌కు ఈ నియోజకవర్గంలో 24,220 ఓట్లు వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని శ్రేణులతో కలిసి మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రభారి అజ్మీర కృష్ణవేణి, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంట్ కో-కన్వీనర్ రాంచంద్రరెడ్డి, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలం రాంబాబు, కౌన్సిలర్ జుర్రు రాజుయాదవ్, లూనావత్ కవిత, మాజీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ తదితరులు పాల్గొన్నారు.

అదను ఉన్నపుడే పత్తి విత్తనాలు వేయాలి

వర్ధన్నపేట, జూన్ 5 : ఇటీవల కురుస్తున్న వర్షాలను ఆధారం చేసుకుని వేసవిలో లోదుక్కులు చేసి జూన్, జూలై నెలల్లో పత్తి విత్తనాలు విత్తుకోవాలని వర్ధన్నపేట క్లస్టర్ ఏఈవో మౌనిక తెలిపారు. వర్షాపాతం ఆధారంగా జూలై 30 వరకు పత్తి విత్తనాలు విత్తుకో వచ్చునని పేర్కొన్నారు. ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు పడ గానే తొందరపడకుండా కనీసం 60సెం.మీ వర్షం కురిసాకే గింజలు నాటితే మొలకలు రావడానికి వంద శాతం అవకాశం ఉంటుందన్నారు. రైతులు తమ ప్రాంతానికి అనువైన రెండు మూడు రకాల బీటీ విత్తనాలను ఎంచుకోవాలని, వర్షాధారంగా సాగుచేస్తే త్వరగా పూతకొచ్చే రకాలు, నీటి వసతి ఆయితే మధ్యస్తంగా, ఆలస్యంగా పూత, కాతకు వచ్చే రకాలు మేలు. బీటీ విత్తనాలను ఎంపిక చేసుకునే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నేల స్వభావాన్ని దృష్టిలో పెట్టుకుని 40 లేదా 42అంగుళాల అచ్చువేసుకుని విత్తితే మంచి దిగుబడి వస్తుందని తేలిక నేలల్లో అయితే అధిక సాంద్రత పత్తిని విత్తుకోవాలి.విత్తిన 48గంటల్లోనే తేమ ఉన్నపుడు పెండిమిథాలిన్ 1.2 లీటర్లు ఎకరాకు పిచికారీ చేస్తే కలుపు ఉధృతి తగ్గుతుందని వివరించారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

ఖానాపురం, జూన్ 5: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించేందుకు మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను, యూనిఫామ్స్‌ను బుధవారం ఎంఈవో రత్నమాల ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభంకాగానే విద్యార్థులకు అందించేందుకు మండలంలోని 36ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 8వేల పాఠ్యపుస్తకాలు, 13వేల నోట్‌బుక్‌లు ఆయా పాఠశాలలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో బీఆర్ఎస్ నాయకుల చేరిక

నర్సంపేట, జూన్ 5 : బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సమక్షంలో నియోజకవర్గంలోని దుగ్గొండి మండలానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు నూతనకంటి శ్రీనివాస్, లింగాల బుచ్చయ్య బుధవారం బీజేపీలో చేరారు. వీరికి కాషాయం కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, దుగ్గొండి మండల బీజేపీ అధ్యక్షుడు రాజేందర్, నర్సంపేట మండల కమిటీ అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బూసాని రమేష్, బైరి పవన్‌కుమార్, శ్రవణ్, లింగన్న, మహిళా మోర్చా నాయకులు సూత్రపు సరిత, హైమావతి పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

దుగ్గొండి, జూన్ 5 : మండల కేంద్రంలోని ప్యాక్స్ సొసైటీలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి దయాకర్ బుధవారం వెల్లడించారు. రైతులు పట్టా దార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి జీలుగ విత్తనాలు తీసుకోవాలని ఆయన తెలిపారు. 30 కిలోల బస్తా రూ:1,116లకు లభిస్తుందని, అందుబాటులో 267బస్తాలు ఉన్నాయని, కావలసిన రైతులు తీసుకోవాలని ఏవో పేర్కొన్నారు.

జల్లిలో పెద్దమ్మ తల్లి బోనాలు

చెన్నారావుపేట, జూన్ 5: మండలంలోని జల్లిలో పెద్దమ్మతల్లి బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజ్ కులస్థులు ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్స్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ మాట్లాడుతూ పెద్దమ్మతల్లి పండుగను రాష్ట్రమంతటా ఒకే రోజు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి అధికారికంగా జరపాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు యూట సుధాకర్, శ్రీనువాస్, దొంతరబోయిన నరేష్, అశోక్, రాజు, అశోక్, శరత్, వాకిటి ప్రదీప్, కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మంపేటలో కాంగ్రెస్ సంబరాలు

దుగ్గొండి, జూన్ 5 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్‌కు మండలంలోనే తిమ్మంపేటలో 796 ఓట్ల మెజారిటీ రావడంతో గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బాణ సంచాలు కాల్చి సంబరాలు జరుపు కున్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రొట్టె రమేశ్, ప్రధాన కార్యదర్శి కొలిపాక భాస్కర్, మండల నాయకులు పెండ్యాల సాంబయ్య, సౌడారపు బాలయ్య, గిన్నె నర్సింహస్వామి, ఒద్దుల రఘుపతిరెడ్డి, దండు శ్రీనివాస్, సంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐసెట్ ప్రశాంతం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5 : 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-2024 ప్రవేశ పరీక్ష ప్ర శాంతంగా జరిగినట్లు కన్వీనర్ ఆచార్య ఎస్.నరసింహాచారి తెలిపారు. మొదటి సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఎంపిక చేసిన 115 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 28,931 విద్యార్థులకు 25,982 మంది హాజరైనట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 116 పరీక్ష కేంద్రాల్లో 28,969 విద్యార్థులకు 26,298 హాజరైనట్లు పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన ఉదయం సెషన్‌తో ప్రవేశ పరీక్ష పూర్తవుతుందన్నారు. వరంగల్ రీజియన్‌లోని వరంగల్, నర్సంపేటలోని 8 సెంటర్లలో బుధవారం ఉదయం మొదటి సెషన్‌లో మొత్తం 1,554 మంది విద్యార్థులకు 1,446 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 1,554 మంది విద్యార్థులకు 1,462 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఖానాపురం, జూన్ 5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను అటవీ శాఖ, స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో పాకాలలో బుధవారం నిర్వహించారు. పాకాల సరసర ప్రాంతాల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలిగించి శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. పర్యావరణ ప్రేమికుడు, ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో రవికిరణ్, డీఆర్వోలు నాగరాజు, మోహన్, సోమ, స్వయంకృషి సంస్థ నిర్వాహకు డు బెజ్జంకి ప్రభాకర్, నాగెల్లి సారంగంగౌడ్, విజడమ్‌హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

- దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలో జాతీయ ఉపాధి కూలీలచే పర్యావరణం కాపాడాలని మానవహారం ప్రతిజ్ఞను నిర్వహించారు. ఎంపీడీవో అరంధతి మాట్లాడుతూ పర్యావరణకోసం పెద్ద సంఖ్యలో మొక్కలు పెంచాలని, కలుషితం కాకుండా ప్లాస్టిక్ వ్యర్థలను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.
- నెక్కొండ : ప్రతి ఇంట్లోని కుటుంబం సభ్యులందరూ బాధ్యతగా ఒక్క మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ కోరారు. మండలంలోని అమీన్‌పేటలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. చెరువు కట్టలకు ఇరువైపులా మొక్కలు నాటారు. మొక్కను నాటిన ప్రతి ఒక్కరూ రక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ నెల 12 వరకూ మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అధికారులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జాకోబ్, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.
- పర్వతగిరి: పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో శంకర్ అన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా జూట్ బ్యాగులు, స్టీల్ వస్తువులు, క్లాత్ బ్యాగులను వాడాలని, చెట్లను పెంచడం, నీటిని సంరక్షించే చర్యలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో పాక శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.
- వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఇల్లంద, కట్ర్యాల గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. సర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామారావు, బుస్స శ్రీనివాస్, సెర్ప్ సీసీ గోలి కొమురయ్య, వీవోఏలు తక్కళ్లపెల్లి శోభ, పద్మావతి, రమ్య, స్రవంతి, రమ, ఫీల్డ్‌అసిస్టెంట్ రేణుక, ఆశ, అంగన్‌వాడీకార్యకర్తలు మాధవి, భాగ్యలక్ష్మి, భారతి పాల్గొన్నారు.
- చెన్నారావుపేట: పర్యావరణం కాపాడడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో గోవిందరావు అన్నారు.మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ప్రతీ ఇంటిలో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు ఏపీవో అరుణ, ఏపీఎం ఈశ్వర్, ఏఈవో స్మిత, కిషోర్, స్వేత, శ్యామ్, సాంబరాజు, రాములు, టైపిస్టు రజిత, తదితరులు పాల్గొన్నారు.
- గీసుగొండ : మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఏపీవో చంద్రకాంత్ అన్నారు. ఎలుకుర్తిలో సీడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ప్రతీ గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలన్నారు. కార్యదర్శి కళ్యాణి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పట్ల గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీడబ్ల్యుఎస్‌కో-ఆర్డినేటర్ కొమ్ముల నవీన్, పూర్ణిమ, మంజుల పాల్గొన్నారు.
- సంగెం: గ్రామాల్లో పర్యావరణాన్ని రక్షించుకోవాలని సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి అన్నారు. మండలంలోని కుంటపల్లిలో ఎంపీపీతో పాటు జడ్పీసీఈవో రాంరెడ్డిలు హాజరై ఉపాధి కూలీలతో కలసి ర్యాలీ నిర్వహించారు. కుంటపల్లి చెరువుకట్టకు మొక్కలు నాటారు. జడ్పీసీఈవో మాట్లాడుతూ పర్యావరణా న్ని కాపాడితే అది వందరెట్లు మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో సంగెం ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, ఈజీఎస్ జేఈ గణేష్, పంచాయతీ కార్యదర్శి వాజిత్, సువర్ణ, మాధవి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, సొసైటీ డైరెక్టర్ గోపతిరాజు తదితరులు పాల్గొన్నారు.గుంటూరుపల్లిలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో, వికాస్ యూత్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వలంటీర్ గాలి భిక్షపతి, యూత్ అధ్యక్షుడు వెల్దండ సురేష్ తదితరులు మొక్కలు నాటారు.

దాడికి పాల్పడిన పలువురిపై కేసు నమోదు

చెన్నారావుపేట, మే 5 : భూమి తగదా విషయంలో గొడవ పడి, దాడికి పాల్పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండలంలోని తోపనగడ్డతండాకు చెందిన బానోతు ఈర్య, సంధ్యల మధ్య గత కొంతకాలంగా భూ తగదాలు జరుగుతున్నాయి. ఈ నెల 3వ తేదిన రాత్రి సంధ్యా అతని బంధువులతో కలిసి ఈర్య ఇంటిపైకి వెళ్లి, ఈర్యతో పాటు అతని భార్య మంగమ్మలపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు ఈర్య ఫిర్యాదు మేరకు సంధ్య శ్రీనివాస్, నర్సింహ, మంగమ్మ, రాజేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

గీసుగొండ, జూన్ 5 : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య అన్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల సరళిపై ఆమె ఎలుకుర్తిలో బుధవారం మాట్లాడారు. రాష్ట్రంలో 8 స్థానాలతో పాటు దేశంలో కాంగ్రెస్‌కు 230 ఎంపీ స్థానాలు రావడం కాంగ్రెస్ వైపే ప్రజలు చూస్తున్నారనడానికి నిదర్శనమన్నారు. పార్టీకి గౌరవప్రదమైన స్థానాలు ఇచ్చిన ప్రజలందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పకడ్బందీగా నిర్వహించాలి

(5వ పేజీ తరువాయి)

9168 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరా నిఘాలో ఉంటుందని తెలిపారు. ఈసారి బయోమెట్రిక్ హాజరు విధానం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ నెల 9వ తేదీన జరగనున్న పరీక్షకు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని, ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష హాలులోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.

రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలి


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలరాజు

నర్సంపేట టౌన్, జూన్ 5: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో బుధవారం సంఘం డివిజన్ అధ్యక్షుడు గట్టికృష్ణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు రైతులకు పట్టాలు అందించాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి కూలీలకు 200 రోజుల పాటు ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600 వంతున కూలీ అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి జక్కుల తిరుపతి, గుగులోతు భద్రాజీ, మల్లయ్య, వీరారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

సైదానాయక్‌కు సన్మానం

పర్వతగిరి, జూన్ 5: నర్సంపేట పోస్టల్ డివిజన్ ఐపీవోగా సేవలందించి వరంగల్ నార్త్ సబ్ డివిజన్ ఐపీవోగా సైదానాయక్ పదోన్నతిపై వెళ్లడంతో బుధవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బ్రాంచి పోస్టుమాస్టర్లు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, భ గీరథరెడ్డి, నసీరుద్దీన్, బాల్లె రాజు, పరుశురాములు, రామారావు తదితరులు పాల్గొన్నారు.